సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 5 । నవంబర్ । 2024



జాతీయ పోటీలకు ఎంపిక

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్రస్థాయి ఉమ పోటీల్లో గంభీరావుపేట కేజీబీవీ విద్యార్థిని సోని బంగారు పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికైంది. దీపిక, మౌనికలు రజతాలు సాధించారు.



రాజన్నకు కార్తీక శోభ

వేములవాడఅర్బన్: రాజన్న దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం సోమవారం కావడంతో అత్యధికసంఖ్యలో వచ్చారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కోరుట్లపేటలో పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జాతీయస్థాయి మానిటరింగ్ బృందం లీడర్ ఎస్‌పీ సునీల్‌కుమార్, సభ్యులు స్నేహానజీబ్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట, వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసిన పనులను సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేంద్రం నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఏపీడీ నర్సింలు, ఐకేపీ డీపీఎం సుధారాణి, ఎంపీవో రాజు, ఏపీవోలు కొమురయ్య, శ్రీహరి, ప్రత్యేకాధికారి సంతోష్, ఏపీఎంలు మల్లేశం, నర్సయ్య, సీసీ సుధాకర్ పాల్గొన్నారు.

‘వర్కర్ టు ఓనర్’ అమలు చేయండి



సిరిసిల్ల జౌళిశాఖ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల: నేతకార్మికులకు శాశ్వతంగా ఉపాధి కల్పించే ‘వర్కర్ టు ఓనర్’ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ బీవై నగర్‌లోని చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ఎదుట సోమవారం కార్మికులు ధర్నా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేతకార్మికులను ఓనర్లను చేయాలనే లక్ష్యంతో రూ.400 కోట్లతో నిర్మించిన షెడ్లను ఇతరులకు కేటాయించొద్దని కోరారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలుచేసి 1106 మంది కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. 2023లో బతుకమ్మ చీరలు నేసిన కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు మూషం రమేశ్, కోడం రమణ, సిరిమల్ల సత్యం, నక్క దేవదాస్, ఉడుత రవి, గుండు రమేశ్, బెజ్జం సురేశ్, బింగి సంపత్, మోర తిరుపతి, స్వరం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమను ప్రారంభించండి



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: నేతకార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సిరిసిల్లకు చెందిన వస్త్రపరిశ్రమ యజమానులు వెంటనే పరిశ్రమను ప్రారంభించాలని చేనేత, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి కోరారు. స్థానిక సీపీఐ ఆఫీసులో సోమవారం యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. వస్త్రపరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ పోరాటాలతోనే ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ, పాత బకాయిలు చెల్లించిందన్నారు. ఇప్పటికైనా యజమానులు విద్యుత్ బకాయిలు చెల్లించి పరిశ్రమను ప్రారంభించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు నల్ల చంద్రమౌళి, కొంక విజయ్, జంగం జనార్దన్, ఎనగందుల రాజు, సోమ నాగరాజు, గాజుల లింగం, చిలుక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాస్మోటిక్ చార్జీల పెంపుతో ప్రయోజనం



నూతన కార్యవర్గానికి పత్రాలు అందిస్తున్న అధ్యక్షుడు పర్శరాములు

సిరిసిల్లటౌన్: కాస్మోటిక్, మెస్ చార్జీల పెంపుతో బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం జరుగుతుందని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బైరగోని గోపి, ఉపాధ్యక్షుడిగా బిల్లా వెంకట్రాములు, కార్యదర్శిగా ఎడ్ల నరేందర్‌ను ఎన్నుకున్నారు.

వస్త్రోత్పత్తికి పవర్

- 25 హెచ్‌పీలకు 50 శాతం విద్యుత్ రాయితీ
- 50 సాంచాల ఆసాములకు వర్తింపు
- నేతన్నలకు ఈఆర్‌సీ ఊరట
- సిరిసిల్ల కరెంట్ సమస్యకు మోక్షం



ఇది సిరిసిల్లలోని 50 సాంచాల(25 జోడీల) కార్ఖానా. ఇక్కడ 8 మంది నేతకార్మికులు పనిచేస్తారు. నిత్యం రూ.250 నుంచి రూ.350 వరకు ఒక్కో కార్మికుడు ఉపాధి పొందుతుంటారు. ఇలాంటి 50 సాంచాల వస్త్రోత్పత్తి కార్ఖానాలకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) సిఫార్సు చేసింది. గతంలో 10 హెచ్‌పీల సామర్థ్యం గల సాంచాల కార్ఖానాలకు 50 శాతం విద్యుత్ రాయితీ వర్తించేది. కానీ దాన్ని 25 హెచ్‌పీల(50సాంచాల)కు పెంచుతూ టీజీ ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోవడంతో సిరిసిల్ల ప్రాంతంలోని 90 శాతం వస్త్రోత్పత్తిదారులకు మేలు జరుగుతుంది. కేవలం వందలాది సాంచాలున్న పెద్ద సేట్లకు మాత్రం ఈ సబ్సిడీ వర్తించదు.

సిరిసిల్ల: వస్త్రపరిశ్రమకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 23 ఏళ్లుగా 50 శాతం సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేస్తోంది. 2001 నుంచి వస్త్రోత్పత్తి సాంచాలను కుటీరపరిశ్రమగా గుర్తిస్తూ కేటగిరీ–4లో యూనిట్‌ను రూ.4కు సరఫరా చేస్తోంది. ఇందులో ప్రభుత్వం ప్రతీ యూనిట్‌కు రూ.2 భరిస్తుండగా.. సాంచాల యజమానులు మరో రూ.2 ‘సెస్’కు చెల్లించేవారు. ఇలా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో వస్త్రపరిశ్రమ నెట్టుకొస్తోంది. ఇటీవల చోటుచేసుకున్న పలు పరిణామాల నేపథ్యంలో సబ్సిడీని 20సాంచాలు(10హెచ్‌పీలు)లకే పరిమితం చేయాలన్న జీవోను అమలు చేయాలని నిర్ణయించింది. దీనిపై నేతన్నలు పోరుబాట పట్టడంతో ప్రభుత్వం 25 హెచ్‌పీలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

సబ్సిడీ అమలు ఇలా..

2001లో ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం 20 సాంచాలు(10 హెచ్‌పీల) వరకే విద్యుత్ సబ్సిడీ అందించాలని నిర్ణయించారు. కానీ సిరిసిల్లలో ఆకలిచావులు, ఆత్మహత్యల నేపథ్యంలో 10 హెచ్‌పీల నిబంధన అమలు చేయలేదు. ఫలితంగా అందరికీ విద్యుత్ సబ్సిడీ అందింది. దీనిపై కొందరు కోర్టుకెళ్లి 10 హెచ్‌పీల నిబంధన అమలు చేయాలని ఆర్డర్ తేవడంతో సబ్సిడీ అంశం తెరపైకొచ్చింది. మరోవైపు చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి 20.05.2024 నాడు వస్త్రపరిశ్రమల టారిఫ్ 10 హెచ్‌పీల నిబంధన అమలు చేయాలని సూచించారు. ఈమేరకు ‘సెస్’ అధికారులు 20 సాంచాలకంటే ఎక్కువ సాంచాలు ఉన్న కార్ఖానాలకు విద్యుత్ సబ్సిడీ లేకుండా వినియోగించిన ప్రతీ యూనిట్‌కు రూ.7.80 చొప్పున బిల్లులు ఇచ్చారు. దీంతో గతంలో ప్రతీ యూనిట్‌కు రూ.2 చెల్లించిన వస్త్రోత్పత్తిదారులు ఇప్పుడు రూ.7.80 చెల్లించలేక కార్ఖానాలు మూసివేయడంతో సంక్షోభం నెలకొంది.

నేతన్నల పోరుబాట

సిరిసిల్లలో ఎప్పటి నుంచో అమలులో ఉన్న 50 శాతం విద్యుత్ సబ్సిడీని అన్ని కార్ఖానాలకు అమలు చేయాలని ఆందోళనబాట పట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించారు. ఏకంగా వస్త్రోత్పత్తిదారులు దీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 25న సిరిసిల్లలో జరిగిన విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణలో సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ సాంచాల విద్యుత్ సబ్సిడీని 30 హెచ్‌పీలకు పెంచాలని కోరారు. నేతన్నలు అదే విషయాన్ని అధికారుల దృష్టికి తేగా, ఈఆర్‌సీ 25 హెచ్‌పీలకు వర్తింపజేయాలని సిఫార్సు చేసింది.

ఎక్కువ మందికి మేలు



సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు మార్కెట్ లేదు. ఇక్కడ ఉత్పత్తి అయిన వస్త్రాన్ని కొనేవాళ్లు లేక ఇబ్బందులున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కరెంట్ సబ్సిడీ తొలగించడం సరికాదు. 25 హెచ్‌పీల వరకు విద్యుత్ రాయితీని వర్తింపజేయడంతో ఎక్కువ మందికి మేలు జరుగుతుంది. వస్త్రపరిశ్రమకు మనుగడ ఉంటుంది. కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

– కోడం విజయ్‌కుమార్, వస్త్రోత్పత్తిదారుడు

వార్పిన్‌తోపాటు 45 సాంచాలకు వర్తిస్తుంది



సిరిసిల్లలో 25 హెచ్‌పీల వరకు 50 శాతం విద్యుత్ రాయితీ అంశం మా పరిధిలో లేదు. కానీ ప్రభుత్వ నిర్ణయంతో ఒక్క వార్పిన్‌తోపాటు 45 సాంచాలకు విద్యుత్ రాయితీ వచ్చే అవకాశం ఉంటుంది. ఆ లెక్కలపై క్షేత్రస్థాయిలో సర్వేలు జరుగుతున్నాయి. సిరిసిల్లలో ఎక్కువ మంది వస్త్రోత్పత్తిదారులు, ఆసాములకు 25 హెచ్‌పీలతో మేలు జరుగనుంది.

– ఎం.సాగర్, చేనేత, జౌళిశాఖ ఏడీ

అందరి సహకారంతో సాధించాం



సిరిసిల్ల పవర్‌లూమ్స్‌కు కరెంట్ సబ్సిడీ ఎప్పటి నుంచో అమలులో ఉంది. 10 హెచ్‌పీల నిబంధనలతో చాలా కార్ఖానాలు మూతపడ్డాయి. సిరిసిల్లలోని వాస్తవ పరిస్థితులను ప్రభుత్వ పెద్దలకు వివరించాం. ఉన్నతాధికారులకు నివేదించాం. అందరి సహకారంతో 25 హెచ్‌పీల వరకు 50 శాతం విద్యుత్ రాయితీని సాధించాం. సహకరించిన వారికి ధన్యవాదాలు.

– ఆడెపు భాస్కర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు

నిబంధనల మేరకు ముందుకెళ్తాం



వస్త్రపరిశ్రమకు 25 హెచ్‌పీల వరకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలనే టీజీ ఈఆర్‌సీ సిఫార్సులను పాటించాల్సిందే. రాయితీ సొమ్మును ప్రభుత్వం చెల్లిస్తుంది. నిబంధనల మేరకు ‘సెస్’ సంస్థ ముందుకెళ్తుంది. గతంలో విధించిన బిల్లులపై వెసులుబాటు ఇస్తూ.. వసూలు చేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం.

– చిక్కాల రామారావు, ‘సెస్’ చైర్మన్

‘అమృత్’ ద్వారా ఇంటింటికి నీరు



బోటులో ప్రయాణిస్తున్న కేంద్ర మంత్రి సంజయ్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- ఫేజ్–2 పనులకు శంకుస్థాపన

కరీంనగర్ కార్పొరేషన్: అమృత్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీరందించడమే లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అమృత్–2 పథకం కింద రూ.147 కోట్లతో కరీంనగర్‌లో చేపట్టనున్న పనులకు ఫిల్టర్‌బెడ్ వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ పథకాన్ని 2015లో ప్రారంభించామన్నారు. అమృత్–1 కింద దేశవ్యాప్తంగా రూ.50 వేల కోట్లు వెచ్చించి, 1.34 కోట్ల నల్లా కనెక్షన్లు, 1.02 కోట్ల డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చామని పేర్కొన్నారు. అమృత్–2లో భాగంగా రూ.2.99 లక్షల కోట్లతో దేశంలోని మున్సిపాలిటీలు, నగరాల్లో ప్రజల దాహార్తిని తీర్చబోతున్నామని తెలిపారు. తెలంగాణకు రెండు ఫేజ్‌లలో రూ.6,876 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి రూ.852.11 కోట్లు ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థలో అమృత్–1 కింద రూ.136.56 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. అమృత్–2లో మొత్తం 159.55 కిలోమీటర్ల మేర పనులు చేసి, మరో 10,500 కుటుంబాలకు నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు. రూ.18 కోట్లతో హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలోని 5 డివిజన్లకు 24 గంటలు నీటి సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ప్రసాద్ స్కీం కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే నూతన చైర్మన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కమలాకర్ మాట్లాడుతూ.. అమృత్–2 పనులు పూర్తయితే విలీన గ్రామాలకు తాగు నీరందించడంతోపాటు, 24/7 నీటి సరఫరా లక్ష్యం నెరవేరుతుందన్నారు. వేదిక పైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులం ఉన్నామని, అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెట్టాలని సూచించారు. మానేరు రివర్ ఫ్రంట్ 60 శాతం పూర్తయిందని, మిగతా 40 శాతం పనులు పూర్తి చేసేందుకు కేంద్ర సహాయమంత్రిగా బండి సంజయ్ నిధులు తీసుకురావాలని కోరారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, కార్పొరేటర్లు, ప్రజారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

బోయినపల్లి(చొప్పదండి): దత్తాత్రేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లోని బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై వెలసిన దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లేందుకు బోటును సోమవారం ప్రారంభించి మాట్లాడారు. నిర్వహణకు నామమాత్రపు ఫీజుతో బోటు నడపాలని సూచించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పీఆర్ ఈఈ భూమేశ్వర్, ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ నారాయణరెడ్డి, పీఆర్ ఏఈ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది

వేములవాడఅర్బన్/కోనరావుపేట(వేములవాడ): రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి, సంకేపల్లి, కోనరావుపేట మండలం సుద్దాలలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి రైతులు దళారులకు విక్రయించొద్దన్నారు. 8 శాతం లోపు ఉన్న పత్తికి క్వింటాల్‌కు రూ.7,521, 8 నుంచి 12శాతం లోపు రూ.7,200 నుంచి 7,445 మద్దతు ధరగా సీసీఐ నిర్ణయించిందని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- వివిధ సమస్యలపై అర్జీల స్వీకరణ



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. రెవెన్యూ 56, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 18, ఉపాధి కల్పన 11, సిరిసిల్ల మున్సిపల్ 7, ఆర్డీవో, సెస్, ఎంపీడీవో కోనరావుపేట 3, విద్యాశాఖ, ఎంపీడీవో తంగళ్లపల్లి, గంభీరావ్‌పేట, వేములవాడ 2, కార్మికశాఖ, జిల్లా సంక్షేమాధికారి, ఆర్టీసీ సిరిసిల్ల, జిల్లా వైద్యాధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వ్యవసాయాధికారి, ఎంపీడీవో ఇల్లంతకుంట, వేములవాడ రూరల్, ఎల్లారెడ్డిపేట ఒక్కో దరఖాస్తు వచ్చాయి.

ఉద్యోగం ఇచ్చి ఆదుకోండి



నేను వికలాంగురాలిని. మాది చాలా పేద కుటుంబం. డిగ్రీ వరకు చదువుకున్నాను. నాకు ఏదైన ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగం ఇప్పించి, ఆదుకోండి.

– మానుకోల కవిత, ఎల్లారెడ్డిపేట

పెన్షన్ ఇప్పించండి



మాది ముస్తాబాద్ మండలం. మాకు పక్షపాతం వచ్చి ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదు. సార్లు మాపై దయతలంచి పెన్షన్ ఇప్పించాలి.

– పక్షవాతం బాధితులు

నష్టపరిహారం ఇవ్వాలి



మాది తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణా. మా ఊరిలో గౌడసంఘం, రేణుక ఎల్లమ్మ గుడి మిడ్‌మానేరులో మునిగిపోయింది. కానీ మాకు ఎలాంటి నష్ట పరిహారం రాలేదు. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలి.

– గౌడ సంఘం నాయకులు, చింతల్‌ఠాణా

సెల్‌టవర్ నిర్మాణం ఆపాలి



మాది సిరిసిల్లలోని సాయినగర్. మా కాలనీలో దూడం రాజేశం ఇంటిపై ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మిస్తున్నారు. దీని నిర్మాణంతో రేడియేషన్ ఇబ్బందులు వస్తాయి. వెంటనే దాన్ని ఆపాలి.

– సాయినగర్ కాలనీ వాసులు

గణిత టీచర్‌ను నియమించండి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు మామిడి శ్రీనివాస్‌ను తిరిగి ఇదే పాఠశాలకు కేటాయించాలి. ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను బద్దెనపల్లికి కేటాయించారు. మ్యాథ్స్ టీచర్ లేకపోవడంతో పదోతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– తంగళ్లపల్లి విద్యార్థుల తల్లిదండ్రులు

గాంధీచౌక్‌లో ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగించడంతో కనిపిస్తున్న గాంధీజీ విగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్ల: జిల్లా కేంద్రం నడిబొడ్డున గాంధీచౌక్‌లో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి అడ్డంగా ఆదివారం ఓ వ్యాపారి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అప్పటికే పోలీసు అమరవీరుల వారోత్సవాల ఫ్లెక్సీ ఉంది. రెండు ఫ్లెక్సీలతో మహాత్మాగాంధీ విగ్రహం కనిపించడం లేదు. దీనిపై ‘సాక్షి’లో ‘మహాత్మా మన్నించవా’ శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. మున్సిపల్ కమిషనర్ లావణ్య స్పందించి గాంధీ విగ్రహానికి అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగింపజేశారు. మున్సిపల్ స్థలాల్లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మున్సిపల్ చట్టం –2019 ప్రకారం ప్రకటనదారుడికి జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: తోటి విద్యార్థులను స్నేహభావంతో చూస్తూ, అవసరమైన మేరకు సహాయాన్ని అందించాలని ర్యాగింగ్ చేయడం నేరమని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సిరిసిల్ల శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నివారణపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి వివరాలను డయల్ 100కు తెలియజేయాలని కోరారు. మహిళలు, విద్యార్థినిలు జిల్లా షీటీమ్ నంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టిసారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గంభీరావుపేట ఠాణాను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై శివకుమార్ ఉన్నారు. అనంతరం గంభీరావుపేటలోని శ్రీసీతారామస్వామి దేవస్థానాన్ని సందర్శించారు.

బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేం

- కలెక్టరేట్ ఎదుట రైస్‌మిల్లర్ల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైస్ మిల్లర్లు

సిరిసిల్ల: ధాన్యం దింపుకోడానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేమని, జీవో 27పై ప్రభుత్వం పునరాలోచించాలని జిల్లా రా రైస్‌మిల్లర్లు కోరారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. రాష్ట్రంలోని రైస్‌మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లిన రా రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై నిరసన తెలిపారు. రైస్‌మిల్లింగ్ చార్జీలు పొరుగు రాష్ట్రాల్లో క్వింటాలుకు రూ.120 నుంచి రూ.220 ఉంటే.. మన రాష్ట్రంలో రూ.10 నుంచి రూ.30 ఉన్నాయని తెలిపారు. టెస్టింగ్ మిల్లింగ్ చేసి ఓటీఆర్ నిర్ధారించాలని కోరుతుంటే.. పాత విధానం అమలు చేయాలని కోరడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్షుడు పబ్బ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సందుపట్ల రాజిరెడ్డి, ప్రతినిధులు గర్రిపెల్లి ప్రభాకర్, పురం సత్యంరావు, ఆంజనేయులు, గౌరిశెట్టి భాస్కర్, సామల మల్లేశం, నగునూరి శ్రీకాంత్, చేపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



గుగులోత్ సంపత్

ముస్తాబాద్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి గుగులోత్ సంపత్ ఎంపికయ్యాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ఎస్‌జీఎఫ్ లాంగ్‌జంప్ పోటీల్లో పదో తరగతి చదువుతున్న సంపత్ ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభచాటాడని హెచ్‌ఎం రాధాకిషన్‌రావు, పీఈటీ శ్యాంసుందర్ తెలిపారు. విద్యార్థిని ఎంఈవో రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మేడిపల్లి(వేములవాడ): గంజాయి విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ యూసఫ్ వ్యసనాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించేందుకు గంజాయి అమ్మడం అలవాటు చేసుకున్నాడు. సోమవారం ఉదయం భీమారం మండలంలో గంజాయి విక్రయించేందుకు వస్తుండగా తనిఖీల్లో భాగంగా మేడిపల్లి మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. సమావేశంలో సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్యాంరాజ్, సిబ్బంది చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్(ఫైల్)

సిరిసిల్లక్రైం: జీవనోపాధి కోసం చేసిన అప్పులు అధికమవడంతో అవి తీర్చే మార్గం లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. తంగళ్లపల్లి మండలం కందికట్కూరుకు చెందిన వెలిశాల సుధాకర్(40) చంద్రంపేటలో కట్టె కోత మిషన్ నిర్వహిస్తున్నాడు. వ్యాపార నిమిత్తం బ్యాంకుల్లో చేసిన అప్పులు అధికమవడంతో వాయిదాలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఆరోగ్యం సహకరించకపోవడంతో వ్యాపారం దెబ్బతింది. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది చంద్రంపేటలో కట్టెకోత మిషన్ షెడ్‌లో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య లత, 8 ఏళ్ల కొడుకు, ఐదేళ్ల కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు, పట్టీలు చోరీ

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో 14 ట్రాక్టర్లకు చెందిన హైడ్రాలిక్ పట్టీలు, 5 బ్యాటరీలు చోరీకి గురైనట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. ధాన్యంతో లోడు చేసిన ట్రాక్టర్లను ఆదివారం గునుకుల చీమలకుంటపల్లెకు వెళ్లే రోడ్డు పక్కన నిలిపారు. తెల్లారే వరకు బ్యాటరీలు, పట్టీలు లేవు. చోరీకి గురైనట్లు గుర్తించారు.

ఆఖరి మజిలీకీ అవస్థలే!

- నీటమునిగిన వైకుంఠధామాలు
- గ్రామాల శివారులోకి మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్
- దహన సంస్కారాలకు ఇబ్బందులు
- మరోచోట నిర్మించాలని విన్నపం



మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ చేరిన సంకెపల్లి శ్మశానవాటిక

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు సమీప గ్రామాల్లో అంత్యక్రియలకూ తిప్పలుగా మారింది. ప్రాజెక్టులోకి నిండుగా నీరు చేరడంతో బ్యాక్‌వాటర్ వేములవాడ మండలం సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల శివారులోకి వచ్చింది. దీంతో ఆయా గ్రామాల్లోని వైకుంఠధామాలు ప్రస్తుతం బ్యాక్‌వాటర్‌లో సగం వరకు మునిగిపోయాయి. ప్రస్తుతం ఆ రెండు గ్రామాల్లో ఎవరైనా అనుకోకుండా చనిపోతే అంత్యక్రియలు చేసేందుకు స్థలం కరువైంది.

రూ.16లక్షలతో నిర్మాణం

వేములవాడ మండలం సంకెపల్లి, ఆరెపల్లి వైకుంఠధామాలు, కంపోస్ట్‌షెడ్లు ఎదురెదురుగా ఉన్నాయి. రూ.16లక్షలతో వైకుంఠధామం, కంపోస్టుషెడ్లు నిర్మించారు. గతేడాది కంటే ఈ సంవత్సరం మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ పెంచడంతో రెండు గ్రామాల వైకుంఠధామాలు, కంపోస్ట్‌షెడ్లలోకి నీరు చేరింది.

దహనసంస్కారాలకు ఇబ్బంది

సంకెపల్లిలో ఇటీవల మృతిచెందిన వారిని పాత గ్రామంలో స్థలం చదును చేసి అంత్యక్రియలు చేశారు. ఆరెపల్లిలోనూ మృతదేహాలకు వైకుంఠధామం ముందు దారిలోనే అంత్యక్రియలు చేశారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు ముంపులో భూములు కోల్పోవడంలో ఆయా గ్రామాల్లో ఖాళీ స్థలాలు లేవు.



బ్యాక్‌వాటర్ చేరిన ఆరెపల్లి శ్మశానవాటిక

శ్మశానవాటికలోకి నీరు వచ్చింది



సంకెపల్లి శివారులో నిర్మించిన శ్మశానవాటికలోకి మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ చేరింది. అందులో అంత్యక్రియలు చేయలేని పరిస్థితి. ఇప్పటికైనా మరోచోట శ్మశానవాటికను నిర్మించాలి.

– నాంపల్లి తిరుపతి, సంకెపల్లి

రోడ్డుపైనే అంత్యక్రియలు



ఆరెపల్లి శ్మశానవాటికలోకి నీరు వచ్చింది. అందులోకి వెళ్లే పరిస్థితి లేదు. ఇటీవల చనిపోయిన వారి అంత్యక్రియలు శ్మశానవాటిక ముందు దారిలోనే చేశారు. మరో స్థలంలో శ్మశానవాటిక నిర్మించాలి.

– చిలివేణి మల్లేశం, ఆరెపల్లి

పాత గ్రామంలో నిర్మించాలి



సంకెపల్లి కోసం నిర్మించిన శ్మశానవాటిక నీటమునిగింది. సంకెపల్లి పాతగ్రామంలోని ముంపునకు గురైన స్థలం గుర్తించి కొత్తగా శ్మశానవాటిక నిర్మించాలి.

– ఒద్యారం రాజమల్లు, సంకెపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్తాను



సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల్లోని శ్మశానవాటికల్లోకి మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ వచ్చింది. పరిశీలించాలని మా అధికారులకు చెప్పాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– రాజీవ్‌మల్హోత్ర, వేములవాడ ఎంపీడీవో

నేషనల్ హైవే అలైన్‌మెంట్ మార్చండి

- కేంద్ర మంత్రి, రాష్ట్ర విప్, చైర్‌పర్సన్‌లకు వినతులు
- కరీంనగర్, వేములవాడకు తరలిన బాధితులు



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు విన్నవిస్తున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: నేషనల్ హైవే 365–బీ అలైన్‌మెంట్‌ను మార్చాలని సిరిసిల్లకు చెందిన భూనిర్వాసితులు కోరారు. ఈమేరకు సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళను వారు కలిసి వినతిపత్రాలు అందజేశారు. బాధితులు మాట్లాడుతూ మొదటి బైపాస్‌రోడ్డు నిర్మాణంలో తాము ఎంతో విలువైన భూములు కోల్పోయామని, ఇప్పుడు కూడా భూములు, గృహ సముదాయాలు భారీ స్థాయిలో కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల కలెక్టరేట్, రిజిస్ట్రేషన్, ఎస్పీ ఆఫీస్‌లతోపాటు నర్సింగ్ కాలేజీ నేషనల్ హైవేకు అవతలి వైపుకు ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో ప్రజలు ఆయా కార్యాలయాలకు వెళ్లకుండా ఉంటుందన్నారు. మరోవైపు జిల్లా కేంద్రంలో గృహావసరాల భూములు కోల్పోయి పట్టణ అభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. పట్టణం నుంచి కాకుండా శివారు ప్రాంతాల నుంచి నేషనల్ హైవేను నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్చాలని విన్నవించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, భూ నిర్వాసితులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు



విద్యుత్ స్తంభాలు తొలగిస్తున్న అధికారులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలో మూడునెలలుగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించకుండానే సీసీరోడ్డు వేశారు. రెండు నెలలక్రితం 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ, సెస్ అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించారు. ఈ సందర్భంగా సెస్ డీఈ రామ సుబ్బారెడ్డి మాట్లాడారు. మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సెస్ ఏఈ రమేశ్, మాజీ సర్పంచ్ దినాకర్, మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపు

- అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు



గాంధీచౌక్‌లో తొలగించిన కోనోకార్పస్ చెట్లు

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ సుందరీకరణ కోసం డివైడర్లపై నాటిన కోనోకార్పస్(విషవనాలు) చెట్లను మున్సిపల్ సిబ్బంది సోమవారం తొలగించారు. కోనోకార్పస్ చెట్లు విడుదల చేసే పుప్పొడితో శ్వాస సంబంధిత వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. అనేక దేశాల్లో ఈ మొక్కలను నిషేధించారు. కానీ సిరిసిల్లలో సుందరీకరణ కోసం అందమైన పూలమొక్కలను పెట్టాల్సిన మున్సిపల్ అధికారులు ప్రమాదకరమైన మొక్కలను నాటారు. అవి ఇప్పుడు పెద్దవిగా మారి రోడ్లను కప్పేశాయి. మరోవైపు చెట్లు పూలు, కాయలు కాసి పుప్పొడిని గాలిలోకి విడుదల చేస్తున్నాయి. ఈ మొక్కలను తొలగించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. సిరిసిల్ల పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో పట్టణంలోని కోనోకార్పస్ మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చెట్లను నరికి వేయడం నేరమన్నారు. మున్సిపల్ వాహనాలను ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలించాలని హుకూం జారీ చేశారు. మున్సిపల్ సిబ్బందితో ఫారెస్ట్ అధికారులు వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకుని పోలీసు అధికారుల ఆదేశాలతో ఆ చెట్లను తొలగిస్తున్నారని వివరించారు. అనుమతి లేకుండా చెట్లను నరకవద్దని, అవసరమైతే కొమ్మలను కత్తిరించాలని స్పష్టం చేశారు. మొత్తంగా సిరిసిల్ల పట్టణంలో విషవనాల తొలగింపు అటవీ శాఖ అధికారుల అభ్యంతరాలతో ఆగిపోయింది.

పామిడి పట్టణానికి సిరిసిల్ల అయ్యప్ప స్వాములు



పీరా–రజియా బేగం దంపతులతో అయ్యప్పస్వాములు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల నుంచి శబరిమలైకు పాదయాత్ర చేస్తున్న సుమారు 150 మంది స్వాములు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా పామిడి పట్టణానికి చేరుకున్నారు. అక్కడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గౌస్ పీరా రజియా బేగం దంపతులు స్వాములకు భిక్ష(భోజనం)ను ఏర్పాటు చేశారు. గురుస్వామి ప్రయాకర్‌రావు, మధు తదితరులు ఉన్నారు.

పుత్రభిక్ష పెట్టండి

- కొడుకు కోసం తల్లిదండ్రుల ఆరాటం
- నెలకు వైద్యానికి రూ.2.50 లక్షలు..
- ఇప్పటి వరకు రూ.30 లక్షలు ఖర్చు
- ఆపన్నహస్తం అందించాలని వేడుకోలు



కొడుకును బతికించాలని వేడుకుంటున్న తల్లి

రాయికల్(జగిత్యాల): చేతికందే సమయంలో కొడుకు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎలాగైనా కన్న పేగును దక్కించుకోవాలనే ఆశతో ఆ తల్లిదండ్రులు ఇప్పటి వరకు అందినకాడ అప్పు చేసి సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం చేతిలో డబ్బు లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం మల్లేశ్ దర్జీ పని చేస్తుండగా అతడి భార్య సంధ్య బీడీ కార్మికురాలు. వీరి పెద్ద కొడుకు చరణ్ (22 ఏళ్లు). ఈ ఏడాది ఫిబ్రవరిలో అయోధ్య–కుమ్మరిపల్లి గ్రామాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆపరేషన్ చేసిన అనంతరం హైదరాబాద్‌లోని రిహాబ్ కేర్ సెంటర్‌కు తరలించారు. చరణ్ ఆరోగ్యం మెరుగుపడాలంటే చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రతినెలా సుమారు రూ.2.50 లక్షల ఖర్చవుతోంది. తల్లి అతడి వద్దే ఆస్పత్రిలో ఉంటుండగా తండ్రి దర్జీ పనిచేస్తూ కొడుకును బతికించుకునేందుకు నానా తంటాలు పడుతున్నాడు. మరో 4–5 నెలల వరకు చరణ్‌లో కదలిక వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొనడంతో ఆ పేద తల్లిదండ్రులు తమ కొడుకును ఎలాగైనా బతికించుకోవాలనే ఆశతో ఉన్న ఆస్తులు సైతం అమ్మారు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు స్పందించి ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయడానికి
ఫోన్‌పే నంబర్లు : 99638 08663
91214 04030

ఖోఖో విజేతలు మానకొండూర్, తిమ్మాపూర్



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన తిమ్మాపూర్ జట్టుతో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం జరిగిన అండర్ –17 విభాగం ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో మానకొండూరు మండలం ప్రథమ, హుజురాబాద్ మండలం ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో తిమ్మాపూర్ మండలం ప్రథమ, గంగాధర మండలం ద్వితీయస్థానంలో నిలిచాయి. పోటీలకు జిల్లాలోని 16 మండలాల నుంచి 380 మంది బాలబాలికలు హాజరయ్యారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మహేందర్‌రావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. భవిష్యత్తులో విద్య, ఉద్యోగ అవకాశాల్లో క్రీడా రిజర్వేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ యూనిస్‌పాషా, పోటీల నిర్వహణ కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, అంతటి శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బాలసాని రాజ్‌కుమార్‌గౌడ్, కట్ట సంతోష్, వి.శ్రీలత, బాబు శ్రీనివాస్, చందా శ్రీనివాస్, వీరుపాల్‌రెడ్డి, హనుమంతు, రమేశ్, పీసు జ్యోతి, రేణుక, బి.శేఖర్, బి.రేణుక, శివకుమార్, రూపరాణి, కృష్ణవేణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం విజేతలుగా నిలిచిన జట్లకు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ బహుమతులు ప్రదానం చేశారు.

'ఖని'లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం కూల్చివేత



నేలమట్టమైన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం సింగరేణి యాజమాన్యం కూల్చివేసింది. సంస్థకు చెందిన క్వార్టర్‌లో బీఆర్‌ఎస్ కార్యాలయం కొనసాగుతోంది. ఏడాది క్రితం బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రూ.లక్షలు వెచ్చించి యాజమాన్యం మరమ్మతులు చేసింది. అయితే రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా కార్యాలయంలో ఉన్న సామగ్రిని తీసిన తర్వాత సోమవారం పార్టీ కార్యాలయంతో పాటు ప్రహరీని జేసీబీతో కూల్చివేశారు. సెక్యూరిటీ అధికారి వీరారెడ్డితో పాటు సిబ్బంది దగ్గరుండి కూల్చివేత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పార్టీ కార్యాలయం పక్కనే హోంగార్డుల కోసం కేటాయించిన క్వార్టర్‌ను కూడా యాజమాన్యం తొలగించింది. రోడ్డు వెడల్పు కోసం మరిన్ని క్వార్టర్లను తొలగించేందుకు యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది.

'జిల్లా సాధన ఉద్యమ కేసులు ఎత్తివేయాలి'



జిల్లా ఉద్యమకారులు

సిరిసిల్లటౌన్: జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమించిన వారిపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరవేని మల్లేశం కోరారు. కరీంనగర్‌లో కోర్టు కేసుకు సోమవారం హాజరైన సందర్భంగా మాట్లాడారు. జిల్లా ఏర్పడి పదేళ్లు గడిచినా తాము కోర్టుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. చొక్కాల రాము, కంసాల మల్లేశం, మైలారం తిరుపతి, ఎండీ సలీం ఉన్నారు.

రాజన్నకు కార్తీక శోభ

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయం సోమవారం జనంతో కిక్కిరిసింది. కార్తీక మాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకుని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.









కోటేశ్వరస్వామి సన్నిధిలో..

వెల్గటూర్(ధర్మపురి): కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా కోటిలింగాల కోటేశ్వరస్వామి సన్నిధిలో గంగాహారతి కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలచే దీపోత్సవం కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఉత్సాహంగా గోదావరి నదిలో దీపాలు వదిలారు. దేవాదాయశాఖ పరిశీలకులు రాజమౌళి, ఈవో కాంతారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పదిరె నారాయణరావు, రేగొండ రామన్న, అర్చకులు సంజీవ్, నాగరాజు, శంకరయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





కొండగట్టులో..

మల్యాల(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధిలో సోమవారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి, భజనలు చేశారు.



హారతి గైకొనుమా..

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మి నృసింహస్వామి సన్నిధిలో మూడోరోజు సోమవారం సాయంత్రం గంగాహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి గోదావరినదికి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో బయలుదేరి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీశారదా మహిళా మండలి, వాసవీ మహిళా మండలి సభ్యులు, కరీంనగర్‌కు చెందిన తిరుమల సేవా గ్రూప్ సభ్యుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

